సాక్షి విశాఖపట్నం

సోమవారం ¦ 10 ¦ ఫిబ్రవరి ¦ 2025



హిందూ మహాసముద్రం ప్రాంతంలో రక్షణ, భద్రత వ్యవస్థల బలోపేతంలో భాగంగా ట్రోపెక్స్-25 విన్యాసాలు కొనసాగుతున్నట్లు తూర్పునావికాదళ అధికారులు తెలిపారు.

8లో

న్యూస్‌రీల్

జాతీయ క్రీడల్లో మెరిసిన జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: 38వ జాతీయ క్రీడల్లో ఫాస్టెస్ట్ హర్డిలర్‌గా జ్యోతి యర్రాజీ నిలిచింది. వంద మీటర్ల హర్డిల్స్‌ను 13.10 సెకన్లలో పూర్తి చేసి జాతీయ క్రీడల్లో స్వర్ణం సాధించింది. జాతీయ రికార్డు 12.78 సెకన్లతో పాటు గేమ్ రికార్డు 13.22 సెకన్లు జ్యోతి పేరిటే ఉండగా.. ఈసారి తన గేమ్ రికార్డును తనే అధిగమించింది. పశ్చిమబంగా అథ్లెట్ మౌమిత 13.36 సెకన్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

ఎమ్మెల్సీ ఎన్నిక నామినేషన్ల దాఖలుకు నేడు ఆఖరు

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్లు దాఖలుకు సోమవారం చివరి రోజు కాగా.. ఇప్పటివరకు ఎనిమిది మంది నామినేషన్లు వేశారు. ఆఖరి రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. నామినేషన్లను ఈనెల 11న పరిశీలన చేస్తారు. 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, మార్చి 3వ తేదీన కౌంటింగ్ జరగనుంది.

గురుకుల సీవోఈలో ప్రవేశానికి దరఖాస్తులు

మధురవాడ: మధురవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల బాలికల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శాంతి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు, 5వ తరగతిలో 80 సీట్లు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన బాలికలు https:// apbragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా మార్చి 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● కూటమి కుట్రకు కేకేలైన్ బలి

వాల్తేరుకు వంచన



కూటమి కుట్రలకు వాల్తేరు డివిజన్ బలైపోయింది. ఆదాయార్జనలో నంబర్ వన్ డివిజన్‌గా నిలిపిన కేకే లైన్‌ను విశాఖకు కానివ్వకుండా కూటమి ఎంపీ కుయుక్తులు పన్నారు. కేవలం పలాస రైల్వే స్టేషన్ కోసం కొత్తవలస–కిరండూల్ రైల్వే లైన్‌ను అప్పనంగా అప్పగించేశారు. కేకే లైన్ విశాఖ జోన్‌లోనే ఉన్నా.. రవాణా చార్జీల వసూళ్లన్నీ రాయగడ డివిజన్‌లో జరగనుండడంతో ఆదాయ పంపకాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సోషల్ మీడియాలో విశాఖవాసులు దుమ్మెత్తిపోస్తున్నారు.

- పలాస కోసం ఆదాయ వనరును అప్పగించేశారు!
- కేకే లైన్ నుంచి కొత్త జోన్‌కి ఆదాయంపై అనుమానాలు
- విశాఖ నుంచి బయలుదేరే రైళ్లు శ్రీకాకుళం నుంచి నడిపేందుకు పావులు
- తొలుత గరీబ్ రథ్, తర్వాత గోదావరికి ప్రతిపాదనలు పంపిన నేతలు
- మరోవైపు వాల్తేరు రైళ్లపై కొనసాగుతున్న దక్షిణ మధ్య రైల్వే వివక్ష
- 230 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్న ఎల్‌టీటీ 10 రోజులు రద్దు



రైల్వే జోన్ వరం కాదు.. శాపం అంటూ చంద్రబాబు గతంలో చేసిన ట్వీట్

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర కేబినెట్ ఆమోదంతో విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అయినప్పటికీ ఉత్తరాంధ్ర వాసుల్లో కించిత్ కూడా ఆనందం లేకుండా చేసింది కూటమి ప్రభుత్వం. సుమారు శతాబ్దంన్నర చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌ను కాలగర్భంలో కలిపేసింది. గుండెకాయ లేకుండా పునర్విభజన చేసింది. ప్రస్తుతం ఉన్న డివిజన్‌కు కొండంత ఆదాయం తెచ్చే కేకే లైన్‌ను ఈస్ట్‌కోస్ట్ జోన్‌కు అప్పగించేసింది. దీంతో కొత్తగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా జోన్‌కు, విశాఖ డివిజన్‌కు ఆదాయ మార్గాలు దాదాపు తగ్గుముఖం పట్టినట్లే. దీనికి కారణం కూటమి ఎంపీల ఒత్తిళ్లేనని స్పష్టమవుతోంది. తన జిల్లాలో రైల్వేపై పట్టు సాధించేందుకు ఒక ఎంపీ ఈ అడ్డగోలు విభజనకు రైల్వే మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఖుర్దా డివిజన్‌లో ఉన్న పలాసను విశాఖపట్నం డివిజన్‌కు ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే కేకే లైన్‌ను తమకు అప్పగిస్తే.. పలాసని వదులుకుంటామని ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ అధికారులు ప్రతిపాదన ముందుంచారు. మరో మాట లేకుండా తన స్వలాభం కోసం అంగీకారం తెలపడంతో ఈ అడ్డగోలు విభజన జరిగింది.

ఆదాయ పంపకాలపై స్పష్టత లేదు

వాస్తవానికి కేకే లైన్ రెండు డివిజన్లకు సరిహద్దు **మధ్య భాగంగా ఉంది. ఈ లైన్ సింహ**భాగం కార్యకలా**పాలన్నీ విశాఖపట్నం డివిజన్ పరి**ధిలోనే ఉంటాయి. **అయితే కేకే లైన్‌లో సరకు రవాణా** ఎక్కువగా జరుగు**తుంటుంది. దీనికి సంబంధించిన** రవాణా వసూళ్లన్నీ **కిరండూల్ సెక్షన్‌లో నిర్వహిస్తారు.** అక్కడ చార్జీల చెల్లిం**పులు జరిగిన తర్వాత గూడ్స్ రైళ్లు** విశాఖపట్నం వైపు **సరకుతో వస్తాయి. ఈ లెక్కన చూస్తే** రెండు డివిజన్లకు ఆదాయం చెందాల్సి ఉంటుంది. కానీ, పంపకాలు ఉన్నాయా లేదా అనే దానిపై రైల్వే బోర్డు స్పష్టత ఇవ్వలేదు. అలాగే కేకేలైన్‌లో ఎక్కువ కొండ చరియలు విరిగి పడుతుంటాయి. ఈ నిర్వహణ బాధ్యతలు ఎవరు చేపడతారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, కేకే లైన్ పరిధిలో విధులు నిర్వర్తించే వారి పరిస్థితి దయనీయంగా మారనుంది. బదిలీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సెలవులు దొరికే పరిస్థితులు కూడా ఉండబోవని చెబుతున్నారు.

రామ్మోహన్‌నాయుడు కొత్త ఎత్తులు

వాల్తేరు డివిజన్‌ను ఇవ్వకపోతే ఉద్యమిస్తామని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబుతో సహా కూటమి నేతలు బీరాలు పలికారు. కేంద్రంలోని బీజేపీని చీల్చిచెండాడతామని హెచ్చరించారు. వాల్తేరు డివిజన్‌ను రద్దు చేయకూడదని దీక్షల పేరుతో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు హడావుడి చేశారు. ఇప్పుడు వాల్తేరు డివిజన్‌ను విడదీయడంతో పాటు కీలకమైన కేకే లైన్‌ను విశాఖ డివిజన్‌కు లేకుండా చేస్తే, జోన్, కొత్త డివిజన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేయడంపై ఉత్తరాంధ్ర వాసులు మండిపడుతున్నారు. అలాగే విశాఖ నుంచి నడిచే రైళ్లను శ్రీకాకుళం, పలాస వరకు పొడిగించాలని ప్రతిపాదనలు రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ముందుగా విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో నడుస్తున్న గరీబ్‌రథ్‌ను శ్రీకాకుళం వరకు పొడిగించాలని ఎంపీ డిమాండ్ చేస్తున్నారు. దీనిపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఇది పూర్తయ్యాక గోదావరి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వంటి మరిన్ని రైళ్లను పలాస లేదా శ్రీకాకుళం వరకు పొడిగించేందుకు ఎంపీ ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే కేకే లైన్ పోయినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

మూలధన నిధులన్నీ.. ఆ లైన్‌కేనా.?

జోన్ అభివృద్ధి కోసం నాలుగేళ్లపాటు ప్రతి బడ్జెట్‌లోనూ మూలధన పెట్టుబడి కింద నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో 57 కిమీ మేర అమరావతి రైల్వే లైన్ ఇప్పుడు ప్రతిపాదనల్లో ఉంది. రూ.3 వేల కోట్ల వ్యయంతో ఈ లైన్ నిర్మాణం జరగనుంది. అంటే.. ప్రతి బడ్జెట్‌లో వచ్చే నిధులు, జోన్ ఆదాయం మొత్తం అమరావతి లైన్ హరించేస్తుందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.



గతంలో వాల్తేరు కోసం రామ్మోహన్ నాయుడు ట్వీట్లు

సందట్లో సడేమియా.. సౌత్ సెంట్రల్ కుట్ర!

ఓవైపు సరిహద్దుల విభజనలతో వాల్తేరు డివిజన్ సతమతమవుతుంటే.. దక్షిణ మధ్య రైల్వే అధికారులు తమ వివక్షను వీడటం లేదు. విశాఖ నుంచి నడిచే ముఖ్యమైన రైళ్లను సైతం ఏదో ఒక సాకుతో రద్దు చేస్తున్నారు. గతంలో 150 నుంచి 175 శాతం ఆక్యుపెన్సీతో నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే రత్నాచల్, సింహాద్రి, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ట్రాక్ మరమ్మతులు, ఆధునీకరణ పనులు, మెయింటెనెన్స్ అంటూ కారణాలు చూపుతూ చాలా రోజులు రద్దు చేశారు. తాజాగా అత్యంత రద్దీగా నడుస్తున్న విశాఖపట్నం - ముంబై (185190/18520) ఎల్‌టీటీ రైలుపై కక్షగట్టారు. నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల పేరుతో ఈ నెల 10 నుంచి 20 వరకు ఈ రైలును రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ రైలుకు 20వ తేదీ వరకు రెండువైపులా 230 శాతం ఆక్యుపెన్సీ ఉంది. అయినప్పటికీ దక్షిణ మధ్య రైల్వే అధికారులు కుట్రపూరితంగా వ్యవహరించి, వాల్తేరు డివిజన్ ఆదాయానికి గండికొట్టేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని వాల్తేరు డివిజన్ సిబ్బంది ఆరోపిస్తున్నారు.



విశాఖపట్నం-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్

నేరాలను ఉపేక్షించం..



మాట్లాడుతున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా. చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చి, పోలీస్ అధికారులు

- మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం
- డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

అల్లిపురం : నగరంలో క్రైమ్ రేటు పెరిగితే ఉపేక్షించేది లేదని, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశించారు. ఆదివారం ఆయన నగర పోలీస్ కమిషనరేట్‌లో గల నూతన సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో రౌడీయిజానికి తావులేకుండా చూడాలన్నారు. పోలీసింగ్ మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అలాగే కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ విభాగాల పరితీరుపై పీపీటీ ద్వారా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వివరించారు. అనంతరం డీజీపీ పోలీస్ అధికారుల నుంచి అర్జీలను స్వీకరించారు. త్వరలోనే అర్జీలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ డీసీపీ-1 అండ్ 2, అడ్మిన్ డీసీపీ, క్రైం డీసీపీ, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- సెల్ఫ్ సెంటర్లలో పరీక్షలు
- జిల్లాలో 153 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 39,529 మంది విద్యార్థులు



విశాఖ విద్య : ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లాల్లో సర్వం సిద్ధం చేశారు. విద్యార్థులు చదువుకున్న కాలేజీ(సెల్ఫ్ సెంటర్)ల్లోనే సీసీ కెమెరాల పర్యవేక్షణలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకు జిల్లాలో ఎంపిక చేసిన 153 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ప్రాక్టికల్స్ పర్యవేక్షణకు విధులు కేటాయించే అధ్యాపకుల జాబితాను సైతం ఆన్‌లైన్ ద్వారా నేరుగా కాలేజీలకు పంపించారు.


ల్యాబ్ ఉన్న కాలేజీలకే అనుమతి

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 153 కేంద్రాలను ప్రాక్టికల్ పరీక్షల కోసం ఎంపిక చేశారు. పరీక్షల నిర్వహణకు అనువైన సౌకర్యాలు లేకపోవటంతో కొన్ని కాలేజీలను జాబితా నుంచి తప్పించారు. ఇలాంటి కాలేజీల విద్యార్థులు సమీపంలోని మరో కేంద్రంలో ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు 34,645 మంది, బైపీసీ విద్యార్థులు 4,884 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతీ రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రారంభమయ్యే మొదటి స్పెల్ పరీక్షలు 146 కేంద్రాల్లో జరగనుండగా, ఉదయం 7,562 మంది, మధ్యాహ్నం 5,717 మంది హాజరవుతారని అధికారులు వెల్లడించారు.

కార్పొరేట్ కాలేజీలపై ప్రత్యేక నిఘా

ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ మార్కులు ఎంతో కీలకమైనవి. ఎంపీసీలో భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం.. బైపీసీలో భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, బోటనీ, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించి ప్రాక్టికల్స్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఒక్కో పరీక్షకు 30 మార్కులు ఉంటాయి. కార్పొరేట్ కాలేజీల్లో ప్రయోగ పరీక్షలపై నిఘా పెంచారు. పరీక్షల నిర్వహణ మొత్తాన్ని సీసీ కెమెరాల్లో రికార్డు చేయనున్నారు. దీనిని నగరంలోని ఆర్‌ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోలర్ రూమ్‌తో పాటు, ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారుల సైతం పర్యవేక్షణ చేసేలా తగిన ఏర్పాట్లు చేశారు.

వాట్సాప్‌లోనూ హాల్ టికెట్లు



ప్రాక్టికల్ పరీక్షలు జరిగే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి. విద్యార్థులు హాల్ టికెట్లను 9552300009 నంబర్ గల వాట్సాప్‌లో అందుబాటులో ఉంటాయి. కేంద్రాల్లో ఇబ్బందులపై 0891-2567561, 9440135490, 9440137955 ఫోన్ నంబర్లలో సంప్రదించాలి.

– పి.మురళీధర్, ఆర్‌ఐవో

కంటి వెలుగులు.. కన్నీటిపాలు



సూర్యతేజ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) సూర్యతేజ(ఫైల్)

అయ్యోదేవుడా ఎంత పని జరిగిపోయింది... కళ్ల ముందే కన్నకొడుకులను తీసుకువెళ్లిపోయావా.. ఇక మాకు దిక్కెవరూ.. స్నానం చేసి వెంటనే వచ్చేస్తాం.. వచ్చిన వెంటనే ఇంటికి వెళ్లిపోదాం అంటూ వెళ్లారు... అంతలోనే గంగలో కలసిపోయారా నాయనలారా... అంటూ కన్నవాళ్ల రోదనలతో చూపరులు కన్నీటి సంద్రమయ్యారు. చేతికి అంది వచ్చిన కుమారులు కళ్ల ముందే సముద్రంలో కొట్టుకుపోతున్నా కాపాడలేని నిస్సహాయ స్థితిలో విలపించారు.

- వాడపాలెం తీరంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- మరొకరి ఆచూకీ దొరకని వైనం
- మత్స్యకారులు, మెరైన్ పోలీసుల సాయంతో గాలింపు



గల్లంతైన పవన్‌తేజ్(ఫైల్)

రాంబిల్లి (యలమంచిలి): అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడపాలెం సముద్రతీరంలో ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు స్నానానికి దిగి గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభించగా, మరొకరి ఆచూకీ తెలియలేదు. ఈ ఘటనకు సంబంధించి రాంబిల్లి సీఐ సీహెచ్.నరసింగరావు, మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాంబిల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అన్నదమ్ములైన మొక్కశ్రీధర్, మొక్క మల్లికార్జునరావు వృత్తిరిత్యా విశాఖపట్నంలో వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. మొక్క శ్రీధర్ ఎల్‌అండ్‌టీ కంపెనీలో పనిచేస్తూ కంచరపాలెం ఇందిరానగర్‌లో పాప బాబుతో నివసిస్తున్నాడు. మల్లికార్జునరావు సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ దువ్వాడ దగ్గర సంధ్యనగర్ వద్ద పాప, బాబు భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. శ్రీధర్ కుమారుడు సూర్యతేజ్ (17) తగరపువలస వద్ద ఉన్న అనిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రథమ సంవత్సరం కెమికల్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మల్లికార్జునరావు కుమారుడు పవన్‌తేజ (17) దువ్వాడ వద్ద ఉన్న విజ్ఞాన్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. వీరు ఆదివారం ఉదయం సూర్యదేవుని నోములు పండగను రాంబిల్లి మండలంలో వారి కుటుంబ సభ్యులు అందరితో జరుపుకోవడానికి వచ్చారు. ఉదయం పూజలు చేసుకొని మధ్యాహ్నం వాడపాలెం సముద్రతీర ప్రాంతానికి వెళ్లారు. తీరం వద్ద సందడిగా గడిపారు. 3.30 నుంచి 4 గంటల సమయంలో సూర్యతేజ, పవన్‌తేజ సముద్రంలో స్నానానికి వెళ్లి కెరటాల ఉధృతికి కొట్టుకుపోయారు. సమీపంలో ఉన్న మత్స్యకారులు సమాచారం తెలుసుకుని సహాయక చర్యలు చేపట్టగా సాయంత్రం సూర్యతేజ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ మత్స్యకారులకు చిక్కాడు. వారు సూర్యతేజకు సి.పి.ఆర్ ప్రథమ చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో మృతి చెందాడు. సూర్యతేజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించగా సమాచారం అందుకున్న రాంబిల్లి పోలీసులు, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారుల సహాయంతో తీరం వెంబడి పవన్‌తేజ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పరవాడ డీఎస్పీ విశ్వస్వరూప్ సంఘటన స్థలానికి చేరుకొని సమీక్షించారు. రాత్రయినా పోలీసులు అక్కడే ఉండి పర్యక్షించాలని ఆదేశించారు. కొత్తపేట గ్రామానికి చెందిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారన్న వార్త తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు వాడపాలెం తీరం వద్దకు వచ్చి కన్నీరుమున్నీరయ్యారు.

బాబోయ్.. జ్వరాలు

- భయపెడుతున్న డెంగ్యూ, మలేరియా కేసులు
- కొద్ది రోజులుగా కదలని ఫాగింగ్ యంత్రాలు
- దోమల నివారణ కోసం సర్వే చేసే 431 మంది సిబ్బంది తొలగింపు
- నగరంలో పేరుకుపోతున్న వ్యర్థాలు



నగరంలో పేరుకు పోయిన చెత్తాచెదారం



రామకృష్ణ మార్కెట్ వద్ద దుర్గంధం

మహారాణిపేట: విశాఖకు జ్వరమొచ్చింది. నగరంలో ఎక్కడ చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. అన్‌సీజన్‌లో సైతం జ్వరాలు విజృంభిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. మలేరియా, డెంగ్యూ, ఇతర వైరల్ జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ.. దోమల స్వైర విహారం మాత్రం తగ్గడం లేదు. దోమల నియంత్రణపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దోమలను నివారించే ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరడం, దోమల నియంత్రణపై సర్వే చేసే సిబ్బందిని తొలగించడంతో ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా నగరంలో జ్వరబాధితులు పెరుగుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ప్రైవేటు క్లినిక్‌ల వరకు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి.

ఫాగింగ్ యంత్రాలకు ఆయిల్ కష్టాలు

దోమలను నివారించే ఫాగింగ్ యంత్రాలకు ఆయిల్ కష్టాలు పట్టి పీడిస్తున్నాయి. దీంతో కొద్ది రోజులుగా ఫాగింగ్ యంత్రాల వాహనాలు షెడ్లుకే పరిమితమయ్యాయి. జీవీఎంసీ పరిధిలో మొత్తం 8 ఫాగింగ్ యంత్రాల వాహనాలున్నాయి. 50 స్ప్రేయింగ్ మెషీన్లున్నాయి. మరోవైపు దోమల నివారణ కోసం సర్వే చేయడం, ఏ ఏరియాలో దోమలు ఎక్కువగా ఉన్నాయో గుర్తించే సిబ్బందిని సైతం విధులను తొలగించారు. ఇప్పుడు స్థానికంగా స్ప్రే చేసే సిబ్బంది కొరత ఏర్పడింది. ఫాగింగ్‌యంత్రాల వాహనాలకు ఉపయోగించే ఆయిల్ లేకపోవడంతో స్ప్రేయింగ్ మెషీన్లు నిరుపయోగంగా మారాయి. జీవీఎంసీకి రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో దోమల నియంత్రణపై ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే ఫాగింగ్ యంత్రాల వాహనాలకు ఆయిల్ కొనుగోలుకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నిధులు మంజూరు చేసినట్టు తెలిసింది.

అన్‌సీజన్‌లో జ్వరాల తీవ్రత

సాధారణంగా జ్వరాలు జూలై నుంచి అక్టోబర్ వరకు ఎక్కువగా వస్తుంటాయి. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకు దోమల వృద్ధికి అన్ సీజన్‌గా చెబుతుంటారు. ఈసారి మాత్రం విచిత్రంగా ఎండలు పెరుగుతున్న సమయంలో కూడా దోమలు బెడద తప్పడం లేదు. అపారిశుధ్యం కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు, మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, భూగర్భ డ్రైనేజీలు పొంగి ప్రవహించడం వంటి దృశ్యాలు నగరంలో ఎక్కువ కనిపిస్తున్నాయి. కాలువల్లో సకాలంలో పూడికలు తీయకపోవడం కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి.

పేరుకుపోయిన చెత్తాచెదారం

నగరంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పూర్ణామార్కెట్ వెనుక భాగం, దొండపర్తి, లలితానగర్, వెలంపేట, రేసవానిపాలెం ఐటీ సంస్థ, ప్రసాద్ గార్డెన్స్, రెల్లివీధి, పంజా జంక్షన్, అల్లిపురం, రామకృష్ణ జంక్షన్ రైతుబజార్ ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. వరుసగా రెండు రోజులు సెలవుల వస్తే నగరంలో పలు ప్రాంతాలు డంపింగ్ యార్డుల్లా మారిపోతున్నాయి.

431 మంది ఉద్యోగుల తొలగింపు

దోమల నివారణ కోసం, ఏ ప్రాంతంలో ఎక్కువ దోమలున్నాయో గుర్తించడం కోసం సర్వే చేస్తున్న తాత్కాలిక సిబ్బందిని తొలగించారు. దాదాపు 431 మంది సిబ్బందిపై వేటు వేశారు. ఈ తాత్కాలిక సిబ్బంది వార్డుల్లో పర్యటిస్తూ దోమల గుడ్లు పెట్టే ఏరియాలను పరిశీలించి అక్కడ ఫాగింగ్ చేసేవారు. వీరికి నెలకు రూ.16,470 గౌరవ వేతనం వచ్చేవారు. ఇటీవల 431 మంది తొలగించారు.

డెంగ్యూ, మలేరియా కేసుల నమోదు

దోమల ప్రభావంతో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్య తదితర జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరం సోకుతుంది. ఈ దోమ పగటి పూట కాటు వేస్తుంది. మిగిలిన జ్వరాల కంటే డెంగ్యూ జ్వరం చాలా ప్రమాదకరం. ప్రస్తుతం నగరంలో డెంగ్యూ జ్వర బాధితులు కేజీహెచ్‌తో పాటు వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నగరంలో 23 మంది డెంగ్యూ బాధితులు, పదిమంది మలేరియా రోగులు చికిత్స పొందుతున్నారని జిల్లా వైద్యశాఖ అధికారులు తెలిపారు.

It's a ఫన్ టైం


ఆర్కే బీచ్‌లో సండే సందడి






బోటు షికారు..



చిన్నారులకు ఆదివారం వచ్చిందంటే ఎక్కడ లేని సంతోషం పొంగుకొస్తుంది. ఆటపాటలతో గడపే సమయం వారికి చిక్కుతుంది. తల్లిదండ్రులతో కలిసి నగరంలో పర్యాటక ప్రాంతాలను, పార్కులను సందర్శించడానికి అమితమైన ఆసక్తి చూపుతారు. బీచ్‌రోడ్డులో పోలీస్ మెస్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన విశాఖ ఎక్స్ పోలో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రంగు రంగుల బాల్స్, చిన్న బోట్, జెయింట్ వీల్, కాశ్మీర్ సిటీ నమూనా వద్ద, ఎమ్యూజిమెంట్ రైడ్స్‌తో పూర్తిస్థాయిలో ఎంజాయ్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సాయంత్రం వేళలో ఆహ్లాదంగా గడిపే వేదికగా వైజాగ్ ఎక్స్‌పో నిలుస్తోంది. అలాగే బీచ్‌రోడ్డులోని ఆర్.కె బీచ్‌తో సహా అన్ని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిక్కిరిశాయి. సముద్రస్నానాలు చేస్తూ, ఇసుక తిన్నెలపై ఆటలాడుకుంటూ నగరవాసులు ఆహ్లాదంగా గడిపారు.

-ఏయూక్యాంపస్/ ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







సాగరతీరం.. ప్రకృతి ఒడిలో పాఠం

ఏయూక్యాంపస్: సాగరతీరానికి ఆదివారం ఉదయం దాదాపు 25 మంది యువత పుస్తకాలు, పెన్సిళ్లు, ఆర్ట్ పేపర్లు, అట్టలు పట్టుకుని విచ్చేశారు. వీరంతా పాండురంగాపురం డౌన్‌లోని కోకో ఎరీనా వద్దకు చేరి తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రకృతి ఒడిలో ఉషోదయ సమయంలో ఆర్ట్ పేపర్‌పై తమ కళ్లముందు ఉన్న దృశ్యాలను పెన్సిల్‌తో ఆర్ట్ పేపర్‌పై పునర్నిర్మించే ప్రయత్నం చేశారు. వీరంతా నగరంలోని ఓ కళాశాలకు చెందిన ఆర్కిటెక్చర్ విద్యార్థులు. బైదబే ఇమేజ్ మేకింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫుట్‌పాత్‌పై కూర్చుని తమ కళ్లముందు ఉన్న భవనాలు, రహదారులు, సాగర తీరం, కొబ్బరి చెట్లు ఆర్ట్ పేపర్‌పై కేవలం పెన్సిల్‌తో కళాత్మకంగా తీర్చిదిద్దారు. ఆర్కిటెక్చర్ విద్యార్థులకు అనేక నైపుణ్యాలు అవసరం. దీనికి ఆహ్లాదకరమైన సాగర తీరాన్ని వీరు సాధనంగా ఎంపిక చేసుకున్నారు.



రుషికొండలో టికెట్ దందాపై విచారణ

- విధుల నిర్వహణలో అలసత్వం సహించం
- సిబ్బందిపై టూరిజం ఆర్‌డీ ఆగ్రహం
- ఉన్నతాధికారుల దృష్టికి సిబ్బంది నిర్వాకం

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ (బ్లూ ఫ్లాగ్)లో జరుగుతున్న టికెట్ దందా, టూరిజం బోటింగ్‌లో పర్యాటకుల నుంచి అదనపు వసూళ్లు, మౌలిక సౌకర్యాల లేమిపై సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు టూరిజం అధికారులు స్పందించారు. ఆదివారం రుషికొండ బీచ్‌లో టూరిజం రీజినల్ డైరెక్టర్ వి.రమణారావు, డివిజనల్ మేనేజర్ జి.జగదీష్ పర్యటించారు. ఈ సందర్భంగా రుషికొండ బీచ్‌లో జరుగుతున్న తప్పిదాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. రుషికొండ సౌత్ రోడ్డు సీ వ్యూ పాయింట్ వద్ద టికెట్ కౌంటర్‌ను, ఏపీ టూరిజం నిర్వహిస్తున్న స్పీడ్ బోట్ల నిర్వహణ, ఆర్‌వో ప్లాంట్, సీసీ కెమెరాలు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పార్కింగ్ టికెట్ల అక్రమాలు, టూరిజం బోట్లలో అదనపు వసూళ్లపై ఆరా తీశారు. సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రపంచం మెచ్చిన బ్లూఫ్లాగ్ బీచ్ రుషికొండలో విధి నిర్వహణలో ఎవరు తప్పు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్కింగ్ అక్రమాలు, స్పీడ్ బోటింగ్‌లో అదనపు వసూళ్లపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని, అనంతరం వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ జరుగుతున్న దందాలపై తమకు సమాచారం అందిందని, అయితే అరకు చలి ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో కాస్త ఆలస్యం అయ్యిందని ఆర్‌డీ వి. రమణారావు తెలిపారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డీ రమణారావు, డీఎం జగదీష్

జీతాల కోసం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఎదురుచూపు

ఉక్కునగరం: జీతాల కోసం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఈరోజు.. రేపు అంటూ ఆశలు రేపుతున్నారే తప్ప చేతికి జీతం అందడం లేదు. గత నెల 30న కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్ పర్యటించిన నేపథ్యంలో జీతాలను రెగ్యులర్ చేయడంపై స్పష్టత వస్తుందని ఉద్యోగులు ఎదురు చూశారు. అయితే కేంద్ర మంత్రి కుమారస్వామి, ఎంపీ, ఎమ్మెల్యేల విజ్ఞప్తులను మన్నించకుండా రెండు, మూడు నెలలు అంటూ దాటవేశారు. ఇచ్చే ఆ పర్సంటేజీ జీతమైనా మొదటి వారంలో వేస్తే కనీసం రుణాలకు డిఫాల్టర్‌గా మారకుండా ఉంటామని ఉద్యోగులు భావిస్తున్నారు. అయితే ఈ నెలలో ఇప్పటి వరకు జీతం వేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉత్పత్తి, అమ్మకాలు జోరుగా ఉన్నా.. కేంద్రం నుంచి ప్యాకేజీ వచ్చినా కనీసం నెల జీతం సక్రమంగా అందకపోవడంపై ఉద్యోగుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

బీచ్ వాలీబాల్ విజేతలకు ఘన స్వాగతం


క్రీడాకారులను సత్కరిస్తున్న గణబాబు

విశాఖ స్పోర్ట్స్: ఉత్తరఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో భాగంగా బీచ్ వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన సాయి, బాబిలతో పాటు కోచ్ ఆనంద్‌కుమార్‌కు విశాఖలో ఘనస్వాగతం లభించింది. వాలీబాల్ సమాఖ్య ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే గణబాబు వీరిని స్వాగతించి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ క్రీడాభిమానులు పాల్గొన్నారు.

వాల్తేరు డిపో ఉద్యమం ఆదర్శనీయం

ఎన్‌ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి

మద్దిలపాలెం: విశాఖ జిల్లా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాల్తేరు డిపోలో చేసిన ఉద్యమం రాష్ట్రంలోనే ఆదర్శమైందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి అన్నారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ తీసుకున్న తీర్మానం మేరకు ఆదివారం డిపో యూనియన్ ఆఫీస్‌లో రీజినల్ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర నాయకత్వం నిరంతరం కార్మికుల సంక్షేమం గూర్చి ఆలోచిస్తుందన్నారు. నైట్ అవుట్ అలవెన్స్‌లను ఇప్పించిందని గుర్తు చేశారు. అదేవిధంగా విశాఖ జిల్లా మహాసభలో నూతన రీజినల్ సెక్రటరీగా గాజువాక డిపో సెక్రటరీ పిళ్లా శంకరరావు, రీజినల్ అధ్యక్షుడిగా పి.ఎస్.మూర్తి(మద్దిలపాలెం డిపో)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జోనల్ కార్యదర్శిగా ఎంవీఆర్ మూర్తి, రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, రాష్ట్ర కార్యదర్శులు వి.అప్పారావు, జి.ఆర్.రావు, జోనల్ అధ్యక్షుడు వి.ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి జోనల్ కార్యదర్శిగా రాములు, జోనల్ చైర్మన్ సూర్యం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామకృష్ణ, బి.నీలకంఠం, వాల్తేర్ డిపో అధ్యక్ష కార్యదర్శులు పతి, వసంత రావు, స్టీల్ సిటీ సెక్రటరీ సాయిరాం, సింహాచలం డిపో అధ్యక్ష కార్యదర్శులు నాయుడు, రాజు, మద్దిలపాలెం అధ్యక్షుడు చిన్న, విశాఖపట్నం డిపో అధ్యక్షుడు ఎ.ఎ. రావు, మధురవాడ సెక్రటరీలు పాల్గొన్నారు.


రీజినల్ మహాసభలో మాట్లాడుతున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	:రూ.110
స్కిన్	:రూ.190
స్కిన్‌లెస్	:రూ.200

- ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం తిలోదకాలు
- డీలర్లదే ఇష్టారాజ్యం..పక్కదారి పడుతున్న పీడీఎస్ సరకులు
- తిండి గింజల కోసం చాంతాడంత క్యూలో బాధితులు

పేదల పరేషన్




బుల్లయ్య కళాశాల సమీపంలో ఎండీయూ వాహనాల్లో సరకులు అందజేస్తున్న డీలర్లు

పౌర సేవల్లో వైఎస్సార్ సీపీ తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలకు రేషన్ సరుకుల డోర్ డెలివరీ తిరుగులేని నిదర్శనం. కలలో కూడా ఎవరూ ఊహించనివి సాకారమయ్యాయి. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను వివక్షకు తావులేకుండా పారదర్శకంగా చేరవేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే పంథాను కొనసాగించి పేదల ఇక్కట్లను తొలగిస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేశారు. పేదలు పనులు మానుకుని రోజంతా రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితిని తప్పించారు. రేషన్ బియ్యమంటే తినటానికి ఏమాత్రం పనికి రావనే గూడు కట్టుకుపోయిన అభిప్రాయాన్ని తొలగిస్తూ నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని కచ్చితమైన తూకంతో ప్యాకింగ్ చేసి మరీ పేదల ఇంటికే పంపించారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఎండీయూ (ఇంటి వద్దకే రేషన్ పంపిణీ) వ్యవస్థకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. పేదలకు రేషన్ సరకులు సక్రమంగా అందని పరిస్థితి కల్పించింది. -మహారాణిపేట

మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లు వాహనాన్ని ఏదో ఒక ప్రాంతంలో నిలిపి అక్కడికే వచ్చి రేషన్ తీసుకోవాలని కార్డుదారులకు సమాచారం ఇస్తున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల చౌకధరల దుకాణాల డీలర్లు ఇష్టమైన రీతిలో సరకులు ఇస్తున్నారు. ఒక్కోసారి సరకులు ఉన్నా లేవన్న సమాధానం వస్తోంది. ఇచ్చే సరకుల కొలతల్లో తేడాలుంటున్నాయి. స్థానికంగా ఉండే చెకింగ్ ఇన్‌స్పెక్టర్ (సీఐ), సహాయ సప్లయి అధికారి (ఏఎస్‌వో) పర్యవేక్షణ లోపం వల్ల దళారుల సహాయంతో పీడీఎస్ సరకులు పక్కదారి పడుతున్నాయి.

ఇష్టారాజ్యంగా సరకులు పంపిణీ

మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ వాహనాలు ప్రస్తుతం ఇంటింటికీ రావడం లేదు. వీధి చివరలో వాహనం నిలిపి సరకులు తీసుకోవడానికి రమ్మని కార్డుదారులకు కబురుపెడుతున్నారు. వీధిలో వాహనం ముందు కార్డుదారులు క్యూ కడుతున్నారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ క్యూ లైన్లు కనిపిస్తున్నాయి. దీంతో కార్డుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రానున్న వేసవిలో రేషన్ కష్టాలు చుక్కలు చూపించడం ఖాయమంటూ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

క్యూ కష్టాలు

జిల్లాలో 5,12,619 తెలుపు కార్డుదారులు ఉన్నారు. వీరి కోసం 625 చౌకధరల డిపోలు ఉన్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిత్యావసర సరకులు తెలుపు/బియ్యం కార్డుదారులకు సబ్సిడీపై ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో డోర్ టూ డోర్ పంపిణీ కోసం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) 310 వాహనాలను ఉపయోగించి సరకులు సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆ వాహనాలు డీలర్లకు ఇష్ట మొచ్చిన ప్రాంతాల్లో నిలిపి అరకొరగా సరకులు సరఫరా చేస్తున్నారు.

ముగిసిన కరాటే పోటీలు



విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సినీనటుడు సుమన్

విశాఖ స్పోర్ట్స్: అంతర్జాతీయ కరాటే పోటీలు పోర్ట్ స్టేడియంలో ముగిశాయి. కాటా, కుమిటీ అంశాల్లో మెన్,వుమెన్‌తో పాటు బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. ఆదివారం పోటీల ముగింపు కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ హాజరై విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ లందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న వారందరూ విజేతలే అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నాయుడు, కోచ్‌లు రిఫరీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ట్రోపెక్స్-25 విన్యాసాలు


విన్యాసాల్లో పాల్గొన్న నేవీ యుద్ధనౌకలు

సింధియా: హిందూ మహాసముద్రం ప్రాంతంలో రక్షణ, భద్రత వ్యవస్థల బలోపేతంలో భాగంగా ట్రోపెక్స్-25 విన్యాసాలు కొనసాగుతున్నట్లు తూర్పునావికాదళ అధికారులు తెలిపారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు మాసాలపాటు వివిధ దశల్లో నిర్వహించే ఇండియన్ నేవీ థియేటర్ స్థాయి కార్యాచరణ వ్యాయామం ట్రోపెక్స్-25లో భాగంగా ప్రస్తుతం హిందూమహాసముద్రంలో భారత నేవీ, ఆర్మీ, వైమానిక, కోస్ట్‌గార్డ్ దళాలు తమ ఆయుధ సంపత్తిని, సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయన్నారు. ఈ విన్యాసాలు భారతీయ నేవీ ప్రధాన యుద్ధ నైపుణ్యాలను ధృవీకరించడంతో పాటు, సముద్ర వాతావరణంలో అసమాన, హైబ్రిడ్ బెదిరింపులకు వ్యతిరేకంగా జాతీయ సముద్ర భద్రతా ప్రయోజనాలను సంరక్షించేందుకు దోహదపడతాయన్నారు. ట్రోపెక్స్-25లో సుమారు 65 భారత నావికాదళాలు, 9 జలాంతర్గాములు, 80కి పైగా వివిధ రకాల విమానాలు పాల్గొంటున్నట్లు నేవీ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

గిరి పుత్రులకు 'కరెంట్' షాక్

- రూ.1.60 లక్షలు విద్యుత్ బిల్లుతో గుండెలు బాదుకున్న గిరిజన కుటుంబం
- డోలవానిపాలెంలో పలువురికి రూ.వేలల్లో బిల్లులు
- ఆగ్రహం చెందుతున్న గిరిజనులు


ఆగ్రహం చెందుతున్న డోలవానిపాలెం గ్రామ గిరిజనులు

రావికమతం: గిరిజన తండాలో ఉచిత కరెంట్‌కు మంగళం పాడేలా కూటమి సర్కార్ చర్యలు చేపట్టింది. 200 యూనిట్లు వరకు గిరిజనులకు ఉచిత విద్యుత్ అందించాల్సివుండగా అమాయక గిరిజనులకు రూ.లక్షలు, వేలల్లో బిల్లులు అందించి వారిని షాక్‌కు గురయ్యేలా చేసింది. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం డోలవానిపాలెం గ్రామానికి చెందిన డోలా సత్తిబాబుకి రూ.లక్షా 60 వేలు బిల్లు అందించారు. సత్తిబాబు ఇంటి వద్ద లేకపోగా కరెంట్ బిల్లు అందుకున్న అతని తల్లి లక్ష్మి రూ.లక్షల్లో వచ్చిన విద్యుత్ బిల్లును చూసి గుండెలు బాదుకుంటూ ఇదేమి మోసమంటూ ఆవేదన చెందింది. ఇదే గ్రామానికి చెందిన గాది నాగరాజుకు చెందిన సర్వీస్ నెంబర్ 11564జె364000004కు రూ, 27,913 బిల్లు అందించారు. ఇదేవిధంగా ఆ గ్రామంలో పలువురికి రూ.వేలల్లో బిల్లులు రావడంతో గిరిజనులు ఆగ్రహం చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు తగ్గించకపోతే ఆందోళనకు దిగుతామని డోలవానిపాలెం గ్రామస్తులు హెచ్చరించారు.

అప్పు తీర్చలేదని ఇంటికి తాళం


ఇంటి బయట నిద్రించిన ఈశ్వరమ్మ, పెద్దకొడుకు, మనుమరాళ్లు

మాకవరపాలెం: కొడుకు తీసుకున్న అప్పు తీర్చలేదంటూ తల్లి నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసిన ఘటన మండలంలోని లచ్చన్నపాలెంలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలాఉన్నాయి. లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన నడింపల్లి ఈశ్వరమ్మకు ఇద్దరు కొడుకులు. వీరిలో చిన్నకొడుకు హరి గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేసేవాడు. అయితే గతేడాది ఫిబ్రవరి 1న ఇదే గ్రామ శివారులో హత్యకు గురయ్యాడు. హరి మరణించిన అనంతరం గ్రామానికి చెందిన లాలం శ్రీను అనే వ్యక్తి వద్ద రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడని, ఈ నగదు ఇవ్వాలంటూ తల్లి ఈశ్వరమ్మను గత కొన్ని రోజులుగా శ్రీను అడుగుతున్నాడు. తనకు తెలియదని చెప్పినా వినకుండా తనతో బలవంతంగా సంతకాలు పెట్టించినట్టు ఈశ్వరమ్మ ఆరోపించింది. ఈ నేపథ్యంలో అప్పు తీర్చకపోవడంతో ఆదివారం శ్రీను తన ఇంటికి తాళం వేసినట్టు తెలిపింది. దీంతో రోడ్డున పడ్డామని వాపోయింది. ఇంటికి తాళం వేయడంతో ఈశ్వరమ్మ, పెద్ద కొడుకు, ఇద్దరు పిల్లలతో ఆరుబయటే ఉండడమేగాక రాత్రికి ఇంటి బయటే నిద్రించాల్సివచ్చింది. ఉన్నట్టుండి పిల్లలతో ఎక్కడికి వెళ్లేదని, తమకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపింది.

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	465.00
విజయనగరం	469.00
శ్రీకాకుళం	469.00

విద్యుత్ శాఖ సర్కిల్ క్రికెట్ విజేత విశాఖ


విజేతగా నిలిచిన విశాఖ సర్కిల్ జట్టు

విశాఖ స్పోర్ట్స్: విద్యుత్ శాఖ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నీలో విశాఖ సర్కిల్ జట్టు విజేతగా నిలిచింది. 33 జట్లు పోటీపడిన ఈ టోర్నీ ఫైనల్‌లో ఎస్పీడీసీఎల్ (నెల్లూరు)జట్టుపై ఆరు వికెట్ల తేడాతో ఏపీఈపీడీసీఎల్ (విశాఖ)జట్టు విజేతగా నిలిచింది. నెల్లూరులో ఈ పోటీలు ఈ నెల రెండో తేదీన ప్రారంభమై శనివారంతో ముగిశాయి.

కాలుష్య దారిలో ఉక్కిరిబిక్కిరి



కంటికి కనిపించే కాలుష్యం. తప్పించుకోలేని జీవనం. మానవ ఆరోగ్యానికి తప్పదు భారీ మూల్యం. జ్ఞానాపురం నుంచి పోర్ట్‌కు వెళ్లే మార్గంలో కనిపించిన దృశ్యం ఇది. భారీగా వాహనాలతో ఈ మార్గంలో భారీగా దుమ్ము రేగుతోంది. వీటిని నియంత్రించడానికి రోడ్లపై నీరు చిమ్మడం వంటివి చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో పనిచేసే కార్మికులు ఇదే కాలుష్యంలో తమ విధులను నిర్వహిస్తున్నారు. ఈ రహదారిలో ప్రయాణించే వాహన చోదకులు సైతం దీని ప్రభావానికి లోనవుతున్నారు.

-ఏయూక్యాంపస్/ ఫొటో: సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం.